PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 151 | 12 శనివారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

- నెలరోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి
- జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు
- ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్



**అమరావతి, సెప్టెంబర్ 11 (ప్రజా సీమ)**

ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

...మిగతా 2 లో...



## ఢిల్లీలో మోదీ-పుతిన్ 'కార్ డిప్లమసీ'...

- భారత్ మండపంలో ద్వైపాక్షిక చర్చల అనంతరం ప్రయాణం
- మళ్లీ అదే సీన్ ఎందుకంత స్పెషల్?
- మోదీ-పుతిన్ ఒకే కారులో ఇన్నోప్రామ్ ప్రదర్శనకు
- బిష్కెక్‌లోనూ ఒకే కారులో వెళ్లిన ఇద్దరు నేతలు
- టియాంజిన్‌లోనూ ఇదే తరహా దృశ్యం

**పుతిన్‌కు ఢిల్లీలో ఘన స్వాగతం**

భారత్–రష్యా స్నేహబంధానికి మరోసారి ఆసక్తికర దృశ్యం కనిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ఒకే కారులో ప్రయాణించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ద్వైపాక్షిక చర్చలు ముగిసిన వెంటనే ఇద్దరు నేతలు కలిసి ఇన్నోప్రామ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు ఒకే కారులో వెళ్లారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత

- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ



ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదు ర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

- 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం
- వైసీపీ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విమర్శలు

**అమరావతి, సెప్టెంబర్ 11 (ప్రజా సీమ)**



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తు న్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయ వంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

...మిగతా 2 లో...

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం...

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

...మిగతా 2 లో...



## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..

**రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు**

- గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

...మిగతా 2 లో...

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..

- మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన
- విభేదాలను పరిష్కరించుకుంటామని స్పష్టీకరణ
- 2019 తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ తొలిసారి రాక
- 2024లో గస్తీ ఒప్పందంతో కీలక పరిణామం
- వరుసగా మూడో ఏడాది మోదీ-జిన్‌పింగ్ భేటీ
- బ్రిక్స్ సహకారంపై జిన్‌పింగ్ కీలక ప్రసంగం



ప్రజాసీమ

# గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..

మొదటిపేజీ తరువాయి

స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

# సీపీ అంబర్ కిషోర్ ఝా ని కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్

(ప్రజా సీమ):

రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝా ను శుక్రవారం మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సిపిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంథని మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలు, ప్రజలకు సంబంధించిన అంశాలపై సీపీ అంబర్ కిషోర్ ఝా తో ఆయన చర్చించారు. అలాగే మంథని పట్టణంలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గణపతి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిపి ని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ కోరారు.



# నేడు మంథనిలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో అంతరాయం

## -మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్

(ప్రజా సీమ):

మంథని మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫ రాలో శనివారం ఉదయం అంత రాయం ఉంటుందని మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం,శనివారం ఉదయం సాంకేతిక సమస్య కారణంగా మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకొని, మున్సిపాలిటీకి సహకరించగలరని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కోరారు.




# డ్రోన్లతో వైద్యం, వ్యర్థాలతో సంపద.. ఏపీ కలెక్టర్ల బెస్ట్ ఐడియాలు!

మొదటిపేజీ తరువాయి

అనంతపురం జిల్లాలో 'స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్' ద్వారా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో 'స్వర్ణ భవిత' పేరుతో ఆటిజం బాధితులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్య, వైద్యం, థెరపీ సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో 'హణఊఖఅ-డిజిటల్ స్కూల్ లెర్నింగ్' కార్యక్రమం కింద 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. 'ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్' పద్ధతిలో తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వివరించారు. ఈ విధానంలో జిల్లాలో ఇప్పటికే 1.94 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టు ద్వారా వ్యర్థాల నుంచి 'గ్రీన్ గోల్డ్' బ్రాండ్‌తో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 'పునర్జీవం' ప్రాజెక్టు కింద బయోచార్‌తో భూసారాన్ని పెంచుతున్నామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుతున్నామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వివరించారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

## -మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

## -ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం

(ప్రజా సీమ)

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో ఈ నెల 8న మంథని రూరల్, మంథని అర్బన్, ముత్తారం, రామగిరి ఎస్‌జీఎఫ్ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా ప్రారంభించగా, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం - క్రీడల ద్వారా ప్రతిభకు ప్రోత్సాహం అనే లక్ష్యంతో క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులను ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, ఆర్ టిఐ మెంబర్ మంథని సురేష్, పీఈటి దొమ్మటి రవి, పిడి కొమురోజు శ్రీనివాస్, వివిధ పాటశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి: రాంచందర్‌రావు

ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

మొదటిపేజీ తరువాయి

ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

# ఢిల్లీలో మోదీ-పుతిన్ 'కార్ డిప్లమసీ'...

మొదటిపేజీ తరువాయి

రెండు దేశాల పరిశ్రమలు, వాణిజ్య శాఖలు కలిసి ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. మోదీ, పుతిన్ ఒకే కారులో ప్రయాణించడం ఇదే తొలిసారి కాదు. ఆగస్టు 31న కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా కూడా ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. ద్వైపాక్షిక చర్చల తర్వాత ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కలిసి వెళ్లారు. గత ఏడాది చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సు సమయంలోనూ మోదీ, పుతిన్ ఒకే కారులో ద్వైపాక్షిక భేటీ వేదికకు వెళ్లారు. దీంతో ఈ విధానాన్ని విశ్లేషకులు 'మోదీ కార్ డిప్లమసీ'గా అభివర్ణిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ దృశ్యాలు పెద్ద చర్చకు దారితీశాయి. ఢిల్లీలో జరిగిన భేటీలో మోదీ.. పుతిన్‌కు రష్యన్ భాషలోకి అనువదించిన 'తిరుక్కురళ్' పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించిన ఈ గ్రంథంలో 1,330 కురళ్లు ఉన్నాయి. నీతి, సంపద, ప్రేమ వంటి అంశాలపై ఇందులో బోధనలు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని రష్యన్‌లోకి అనువదించారు. భేటీకి ముందు మోదీ, పుతిన్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ ఏడాదిలో ఇద్దరు నేతలు కలుసుకోవడం ఇది రెండోసారి. ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సు సందర్భంగా తొలిసారి భేటీ అయ్యారు. 18వ బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పుతిన్ శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆయనకు స్వాగతం పలికారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ మండపంలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. భారత్ బ్రిక్స్ అధ్యక్షతకు 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే థీమ్‌ను ఎంచుకుంది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం...

మొదటిపేజీ తరువాయి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

మొదటిపేజీ తరువాయి

డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# సంపాదకీయం

## మొహం చాటేసిన వర్షాలు...!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగురకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండలంలోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే మున్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కన్నుల పండుగలా ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

## - హాజరైన వైసీపీ సీనియర్ నేత జన్నే రాజేంద్రనాయుడు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు బోయకొండ రోడ్డులోని వలసపల్లెలో యువ నాయకుడు గువ్వల నాగరాజ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్సిపి రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షులు జన్నే రాజేంద్రనాయుడు హాజరుకాగా రెడ్డెప్ప రెడ్డి,ఎన్ .నాగరాజ, లక్ష్మీపతి,ఉదయ్,ఎం. నారాయణ,మాజీ ఎంపిటిసి మునిరెడ్డి,ఎం.మహాదేవ రెడ్డి,శ్యామల తదితరులు హాజరయ్యారు.ఇందులో భాగంగా కేక్ కట్ చేసి ఎంపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాజేంద్రనాయుడు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ అభివృద్ధిలో ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేక ముద్రవేశారన్నారు.ముఖ్యంగా మదనపల్లి నియోజకవర్గానికి మెడికల్ కళాశాల,కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని తీసుకొచ్చి ఎడ్యుకేషన్ హబ్ గా మార్చిన ఘనత ఎంపీదేనని కొనియాడారు. అదేవిధంగా మదనపల్లి - పీలేరు నాలుగు వరుసల రహదారి నిర్మాణం పూర్తి కావడంలో ఆయన కృషి అమోఘమన్నారు.నిస్వార్ధంగా ప్రజాసేవ చేసే అతి కొద్దిమంది రాజకీయ నాయకులలో మిథున్ రెడ్డి ఒకరని,వరుసగా మూడు పర్యాయాలు ఎంపీగా గెలిచి దేశ రాజకీయాలను ఆకర్షించారని ప్రశంసించారు.పార్టీ నాయకులు ,కార్యకర్తలు సంక్షేమం,ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు అధిక



సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలు కూడా భవిష్యత్తును ఇస్తాయి,























## అట్టహాసంగా సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ పోటీలు ప్రారంభం,,,

## పోటీలను ప్రారంభించిన కూన రవికుమార్, బేబీ నాయన,,

**బొబ్బిలి (ప్రజా సీమ)**

చదువుతో పాటు క్రీడలు కూడా భవిష్యత్తును ఇస్తాయని, కష్టపడి సాధన చేసి అనుకున్న క్రీడలో విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేస్తే వారి భవిష్యత్తుకు క్రీడలు కూడా మంచి బాటలు వేస్తున్నాయని రాష్ట్ర సాఫ్ట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలియజేశారు. శుక్రవారం బొబ్బిలిలో ఎమ్మెల్యే, విజయనగరం సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బేబీ నాయన అధ్యక్షతన అట్టహాసంగా ప్రారంభమైన సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు కూన రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన రవికుమార్, బేబీ నాయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా భవిష్యత్తును ఇస్తాయని, ఇప్పటికే అనేకమంది క్రీడల ద్వారా మంచి భవిష్యత్తు పొందారని, భవిష్యత్తులో కూడా కష్టపడి క్రీడలు ఆడే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని, సాఫ్ట్బాల్ క్రీడ కు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, రాష్ట్రంలోని నలుమూలల నుండి వందలాది మంది క్రీడాకారులు బొబ్బిలిలో క్రీడలు ఆడేందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, గెలుపైనా ఓటమి అయినా సమానంగా తీసుకోవాలని, అప్పుడే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడా రిజర్వేషన్ రెండు శాతం నుండి మూడు శాతానికి పెంచామని, గ్రామీణ స్థాయి నుండి క్రీడలను బలోపేతం చేసేందుకు పెద్ద ఎత్తున నిధులను ఖర్చు పెడుతున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ సుర శ్రీనివాసరావు, కన్వీనర్ రమణ, ట్రెజరర్ సామంత్ రెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల సెక్రటరీలు, కోచ్ లు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పీలేరులో హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఎంపీ మిధున్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పీలేరు ప్రజాసీమ :**

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పీలేరులో రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేసి సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి సహాయం అందించవచ్చని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింతగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, హరీష్ రెడ్డి, పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పీలేరు ఎంపీపీ సతీష్ రెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖర్ రెడ్డి,పీలేరు మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి,రాష్ట్ర యూత్ సెక్రటరీ రాహుల్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి ద్వారనాథ్ రెడ్డి,భాను రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, కాలనీ చిన్న, షాకీర్ ,నరేష్, అశోక్ ,సుబ్బు, అమీర్,వినోద్, పాల్గొన్నారు..

## పుల్లంపేట మండలంలో ఘనంగా ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు





**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పి.వి. మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి ధ్వజా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మండల కేంద్రంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బాణాసంచా కాల్చడంతో పాటు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎంపీ మిథున్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామసముద్రం పంచాయతీ ఎస్సీ కాలనీలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే యువ నాయకుడు మిథున్ రెడ్డి రాజంపేట ప్రజల విశ్వాసంతో వరుసగా మూడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికై సేవలందిస్తున్నారని అన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యకర్తలు "జై జగన్ -- జై మిథున్ రెడ్డి" నినాదాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మడగలం శ్రీనివాసులు, జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ గద్దె వెంకటేష్, మాజీ సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మూగ వెంకట్ రెడ్డి. కసిరెడ్డి రాము, రమాకాంత్ రెడ్డి, ఆలం చిన్న చెంగయ్య, కసిరెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి రాము .సామా రాంబాబు, బీకే మణి, పోలి విజయభాస్కర్ రెడ్డి, కొమ్మన రాజారెడ్డి, నూకల శ్రీహరి, పుండ్ల మణి, దుగ్గి సురేష్, సిద్ధారెడ్డి, తల్లెం సుధీర్ రెడ్డి, కోటిరెడ్డి సుబ్బారెడ్డి, పోలి మహేందర్ రెడ్డి తదితర నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజల అభిమాన నాయకుడు ఎంపీ మిథున్ రెడ్డి

### - వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ప్రజా శ్రేయస్సుకై పరితపించే నాయకుడని వైకాపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా పేర్కొన్నారు.శుక్రవారం ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మదనపల్లె పట్టణం,14వ వార్డులో ఇరిగేషన్ కార్పొరేషన్ మాజీ స్టేట్ డైరెక్టర్ దండాల రవిచంద్రా రెడ్డి,పార్టీ శ్రేణుల సమక్షంలో అట్టహాసంగా జరిగాయి.ఇందులో భాగంగా ఎస్.ఏ కరీముల్లా సమక్షంలో కేక్ కట్ చేసి అభిమాన నాయకుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తిరుపతిలోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్.ఏ కరీముల్లా మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో పెద్దిరెడ్డి కుటుంబం ఎల్లవేళలా ముందుంటుందన్నారు.తన తండ్రి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి నుండి రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్న మిథున్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించారని,అనతి కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు.మూడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికై ప్రజాసేవకు పునరంకితమయ్యారని,రాజంపేట పార్లమెంట్ అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తున్నారని కొనియాడారు.మదనపల్లె మెడికల్ కళాశాల,పీలేరు - మదనపల్లె నాలుగు వరుసల రహదారి నిర్మాణం,కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటులో ఆయన పాత్ర క్రియాశీలకమన్నారు.మాజీ సీఎం,వైకాపా అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని విషయాలలో సహాయ,సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ప్రశంసించారు.వైకాపా కార్యకర్తల శ్రేయస్సు,పార్టీ అభ్యున్నతికి నిర్విరామ కృషిచేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు షేక్ షబానా,ముబీనా,అస్మత్ జాన్,గట్టు సురేష్,సురేంద్ర నాథ్,కిశోర్ కుమార్ రెడ్డి,నాగిరెడ్డి,రఫీ,తాజ్ బాషా,రమాదేవి,పెద్దఎత్తున వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.






## రాజంపేట నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### మంత్రి నిమ్మల రామానాయుడుతో డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్ భేటీ

**రాజంపేట(ప్రజా సీమ):**

రాజంపేట పరిసర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకుడు, ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్ కోరారు. ఈ మేరకు జన వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయిన నేపథ్యంలో రాజంపేట పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి డాక్టర్ నవీన్ కుమార్ తీసుకెళ్లారు. డ్యాం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా గాలేరు నది డ్యాం పనులను కూడా పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాజంపేట పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో నీటి కొరతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ అభ్యర్థిత్వంపై మంత్రి సానుకూల స్పందన. రాజంపేటలో తమ కుటుంబం గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో సేవలందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తోందని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరఫున రాజంపేట మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించేలా సహకరించాలని మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు చెప్పారు. తన అభ్యర్థిత్వంపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారని, తనకు పూర్తిగా అనుకూలంగా ఉన్నట్లు డాక్టర్ నవీన్ కుమార్ వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## డిజిటల్ మార్కెటింగ్ రంగంలో పుష్కలమైన ఉపాధి అవకాశాలు

### - మిట్స్ యూనివర్శిటీలో ప్రత్యేక అతిథి ఉపన్యాసం






**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం వారు మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా నెక్స్ట్ జనరేషన్ ఎంబీఏ కెరీర్స్ : హెచ్ఆర్ కెరీర్స్ అండ్ ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్ ట్రెండ్స్ అనే అంశంపై శుక్రవారం అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతికి చెందిన ఇన్నోవేటివ్ అకాడమీ ఫర్ ఐటీ సొల్యూషన్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక హెచ్ఆర్ ఉద్యోగ అవకాశాలు,ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్,పరిశ్రమలో వస్తున్న మార్పులు,భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఎంబీఏ విద్యార్థులు పుస్తకాల ద్వారా పొందే పరిజ్ఞానంతోపాటు ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సంస్థల్లో ప్రత్యక్షంగా పనిచేసి ఆచరణాత్మక అనుభవాన్ని పొందాలన్నారు.ఇంటర్న్‌షిప్‌ల ద్వారా బృందంగా పనిచేయడం,సమయాన్ని సక్రమంగా నిర్వహించడం,పనులను ప్రణాళిక చేసుకోవడం,కమ్యూనికేషన్,సమస్య పరిష్కారం,నాయకత్వ లక్షణాలు మరియు సంస్థల పని విధానాన్ని ప్రత్యక్షంగా నేర్చుకోవచ్చునన్నారు.ప్రస్తుత కాలంలో హెచ్ఆర్ రంగం ఉద్యోగుల నియామకానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రతిభ గుర్తింపు,ఉద్యోగుల శిక్షణ,పనితీరు నిర్వహణ,హెచ్ఆర్ డేటా విశ్లేషణ వంటి విభాగాలకు విస్తరిస్తోందన్నారు.ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్‌లో కంటెంట్ తయారీ,సోషల్ మీడియా మార్కెటింగ్,డిజిటల్ ప్రకటనలు,సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ ,మార్కెటింగ్ ఆటోమేషన్,వినియోగదారుల సమాచార విశ్లేషణ వంటి అంశాలకు ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు.భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థులు ఏఐ పరిజ్ఞానంతోపాటు కమ్యూనికేషన్,డేటా విశ్లేషణ,టీం వర్క్,సమయ నిర్వహణ,సృజనాత్మక ఆలోచన మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.తరగతి గది నుంచి పరిశ్రమకు విద్యార్థులను సిద్ధం చేయడంలో ఇంటర్న్‌షిప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని,ఇంటర్న్‌షిప్‌ను కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా వాస్తవ ప్రాజెక్టులు,సంస్థాగత అనుభవం మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను పొందేందుకు ఉపయోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీన్-స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డాక్టర్ భాను శ్రీ రెడ్డి,డాక్టర్ గంగిశెట్టి,కో-ఆర్డినేటర్స్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు,డాక్టర్ కే.శిరీష మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ మానసా దేవి అమ్మ వారి కి ప్రత్యేక పూజలు

### ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య

**సిద్దవటం( ప్రజా సీమ)**



కడప చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి సమీపాన వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో శుక్రవారం, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు సిద్ధవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుమ లో పల్లె సమీపాన వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య మాట్లాడుతూ అమావాస్య పురస్కరించుకొని అమ్మవారికి, గణపతి పూజ, అగ్ని హోమం, అభిషేకం పారాయణం వంటి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాదాలు ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శర్మ మహిళా భక్తులు పాల్గొన్నారు

## మంచి చేయడమే కానీ మోసం చేయడం తనకు తెలియదు-

### జ్యోతి తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం

### - తన ప్రతిష్టను దెబ్బతీస్తే సహించను : కె.వాణి స్పష్టం



**మదనపల్లె (ప్రజా సీమ) :**

మంచి చేయడమే కానీ మోసం చేయడం తనకు తెలియదని నేషనల్ స్టేట్ హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధి కే.వాణి పేర్కొన్నారు.శుక్రవారం కురబలకోట మండలం,అంగళ్లులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మదనపల్లి పట్టణానికి చెందిన జ్యోతి వద్ద గతంలో తాను రూ.లక్ష తీసుకున్న మాట వాస్తవమేనని,అయితే వడ్డీతో సహా తిరిగి ఆమె మొత్తాన్ని చెల్లించేశానన్నారు.మళ్లీ తాను రూ.8 లక్షలు చెల్లించాలని ఆమె ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ఇదిలా ఉండగా ఆమె దగ్గర కొంతమంది వడ్డీకి నగదు తీసుకున్నారని,వారు సరిగ్గా చెల్లించలేదని తన దృష్టికి తీసుకురాగా,దీంతో దివ్యాంగురాలనే మానవతా దృక్పథంతో వడ్డీలకు తీసుకున్న వారికి ఫోన్ చేసి జ్యోతికి నగదును చెల్లించాలని వారిని కోరడం జరిగిందన్నారు.వెంటనే కొంతమంది ఆమెకి ఇవ్వాల్సిన నగదు చెల్లించారన్నారు.తదనంతరం వడ్డీలు తీసుకున్న కొంతమంది మావద్ద 20 నుండి 30 రూపాయలు వడ్డీ వసూలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేయగా,ఇలా చేయడం తప్పు అని జ్యోతికి సూచించానన్నారు.అప్పటినుండి తనపై కక్షపెంచుకుని లేనిపోని ఆరోపణలు చేస్తోందని,గౌరవప్రదమైన హోదాలో ఉన్న తన పరువును బజారుకు ఈడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.తాను జ్యోతికి ఎటువంటి అప్పులేనని స్పష్టం చేశారు.తన ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదని,ఈ విషయంపై తాను పోలీసులు ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు.ఇప్పటికైనా తనపై ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.ఈ అంశంలో పోలీసులు విచారించి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న జ్యోతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాసీమ

# ప్రతి ఇంటికి భరోసా కూటమి ప్రభుత్వం,,





## ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట,(ప్రజా సీమ)

ప్రతి ఇంటికి అభివృద్ధి - ప్రతి కుటుంబానికి సంక్షేమం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.శుక్రవారం నాడు రాజంపేట పట్టణం,ఉస్మానగర్ నందు పర్యటిస్తూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని,కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను చమర్తి ప్రజలకు వివరించారు.అదేవిధంగా ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూ చమర్తి జగన్ మోహన్ రాజు కరపత్రాలను అందజేశారు.అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి దిశగా పనిచేస్తామని జగన్ మోహన్ రాజు తెలియజేశారు.అనంతరం ఉస్మానగర్ నందు షేక్ జానీ మరియు షేక్ జాబీర్ భాష ఏర్పాటుచేసిన తేనేటి విందుకు హాజరై వారి ఆతిథ్యాన్ని జగన్ మోహన్ రాజు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు,ఎస్కే కరీమ్,లీగల్ సేల్ పార్లమెంట్ అధ్యక్షులు టీ. లక్ష్మీనారాయణ,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,మైనారిటీ నాయకులు షేక్ షామీర్ భాష,చీనేపల్లి హరీష్ కుమార్, భరత్, రెడ్డి శివ, తుపాతుల మహబూబ్ బాషా, రాము యాదవ్, బలిజపల్లి చిన్న, మహమ్మద్ అలీ, పలువురు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పి.వి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

జననేతకు జయహో మంగంపేటలో అట్టహాసంగా జన్మదినోత్సవం

శ్రీ కట్టా పుట్టాలమ్మ సన్నిధిలో పూజలు.. ఉచిత రక్తదానం, చీరల పంపిణీ

రైల్వేకోడూరు ప్రగతికి బాటలు వేసిన ప్రజా నాయకుడు

సాయంలో మేటి.. ప్రతి గుండెకూ శ్రేయోభిలాషి ఎంపీ మిథున్ రెడ్డి

నాయకత్వానికి ప్రతిరూపం, ప్రజల గుండె చప్పుడు రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డి








తిరుపతి బ్యూరో, (ప్రజా సీమ)

ఓబులవారిపల్లె మండలం మంగంపేట పంచాయతీ వైఎస్సార్సీపీ వర్ణశోభితమైంది. వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు, డిఆర్ యుసిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ శుభవేడుకలు పండగలా సాగాయి.ప్రభాత సమయాన్నే శ్రీ కట్టా పుట్టాలమ్మ అమ్మవారి దివ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, ప్రియతమ నేత రాజంపేట పార్లమెంటు సభ్యులు పి.వి మిథున్ రెడ్డి ఆయురారోగ్యాలతో, ఉన్నత పదవులతో నూరేళ్లూ వర్ధిల్లాలని ఆధ్యాత్మిక నీరాజనాలు అర్పించారు. అంతే కాకుండా పూజలు అనంతరం అనంతరం విచ్చేసిన భక్తులకు,ప్రజలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.మంగంపేట బైపాస్ వద్ద కార్యకర్తల ఉత్సాహాల నడుమ భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షల తోరణాలు విరియపూయించారు. కేవలం సంబరాలకే పరిమితం కాక, ప్రాణదానంతో సమానమైన ఉచిత రక్తదాన శిబిరం, మాతృమూర్తులకు ప్రేమపూర్వకంగా ఉచిత చీరల పంపిణీ చేపట్టి సేవలోనూ స్ఫూర్తిగా నిలిచారు.ఈ సందర్భంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "సామాన్య కార్యకర్తను సైతం గుర్తించి ఉన్నత స్థానాన నిలిపే మహోన్నత వ్యక్తిత్వం మిథున్ రెడ్డి ది" అని ప్రశంసించారు. 2014 నుండి నేటివరకు రాజంపేట లోక్‌సభ వేదికగా, రైల్వేకోడూరు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తూ అండర్ బ్రిడ్జ్‌లు, విశాల జాతీయ రహదారులు, స్వచ్ఛమైన మినరల్ వాటర్ ప్లాంట్లు, వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపే ఉచిత మోటార్ బైక్‌లు, పాస్‌ల పంపిణీతో అభివృద్ధి ప్రవాహాన్ని పారించారు. విదేశాల్లో కన్నుమూసిన దిక్కులేని ప్రాణాలకు ఉచిత అంబులెన్స్ సౌకర్యంతో సొంత నిధులతోనే కడసారి ప్రయాణాన్ని చేర్చిన కరుణామయుడు ఆయన అని కొనియాడారు.స్థానిక నేతలు, ఉత్సాహవంతమైన యువత, వైఎస్సార్సీపీ శ్రేణులు మరియు మహిళలు విశేషంగా తరలివచ్చి, తమ ప్రియతమ ఎంపీ మిథున్ రెడ్డికి ఆత్మీయ జన్మదిన మంగళశాసనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటసుబ్బయ్య ఓరుగంట అనిల్ స్వామి రెడ్డి అద్దె వెంకటేశు మొగుల్ మొగిలి నవీను చంటి సుబ్రహ్మణ్యం రమణ వెంకటేశు రాజ్యము ఇర్ఫాను శీను బాలసుబ్రమణ్యం ప్రకాష్ సుంకమ్మ వెంకటమ్మ మణెమ్మ వెంకటసుబ్బయ్య సుబ్బరాయుడు తదితరులు వైఎస్ఆర్పిపి నాయకులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో నాసిరకం డ్రైన్ పనులు

## నాణ్యతపై ప్రజల ఆగ్రహం.. పట్టించుకోని అధికారులు!

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు పట్టణ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదని ఆరోపిస్తున్నారు.పట్టణంలోని పలు వీధుల్లో డ్రైన్ల నిర్మాణానికి రూ.3 కోట్లకు పైగా నిధులతో పనులు మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. ఇందులో సుమారు రూ.1.30 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టర్ 22 శాతం తక్కువకు (లెస్ టెండర్) దక్కించుకున్నారని పేర్కొన్నారు. తక్కువ ధరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు నిర్మాణ పనుల్లో నాణ్యతను గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.డ్రైన్ల నిర్మాణంలో ఇసుకను అధికంగా వినియోగిస్తూ, సిమెంట్‌ను నామమాత్రంగా కలుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే నిర్మించిన డ్రైన్లు కొద్దికాలానికే దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించాలిగొల్లప్రోలులో ప్రస్తుతం జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణంలో వినియోగిస్తున్న ఇసుక, సిమెంట్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌పై నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పనుల్లో నాణ్యతా లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట,(ప్రజా సీమ)

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి వేగవంతమైన పరిష్కారం అందించాలనే సంకల్పంతో చమర్తి జగన్ మోహన్ రాజు శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాలు,పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత,సామాజిక,ఆర్థిక సమస్యలకు సంబంధించిన అర్జీలు,వినతిపత్రాలను చమర్తి జగన్ మోహన్ రాజు కి అందజేశారు.ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన చమర్తి జగన్ మోహన్ రాజు ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు రెవెన్యూ సమస్యలు,భూ వివాదాలు,పింఛన్ల మంజూరు,గృహాల మంజూరు,తాగునీటి సరఫరా,రహదారుల నిర్మాణం,విద్యుత్ సమస్యలు,ఆరోగ్య సేవలు,సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను చమర్తి దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి సమస్యను ఓపికగా విన్న ఇన్చార్జ్ బాధితులకు ధైర్యం చెబుతూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయన తో పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కలకడలో 11 ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితా ప్రదర్శన

కలకడ ప్రజా సీమ :

రాబోయే ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి కలకడ మండలంలో 11 ఎంపీటీసీ స్థానాల ఫొటో ఓటర్ల జాబితాలను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ నంబర్ 515, తేదీ 07-09-2026 మేరకు, జిల్లా ఎన్నికల అథారిటీ ఆదేశాల ప్రకారం ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.కలకడ ఎంపీడీఓ కార్యాలయంలో 11 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఫొటో ఓటర్ల జాబితాలను ప్రజల పరిశీలనార్థం ప్రదర్శించారు.అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యాలయాల నోటీసు బోర్డులపై కూడా ఓటర్ల జాబితాల వివరాలను ప్రజలకు తెలియజేసేలా ప్రదర్శించినట్లు తెలిపారు.అలాగే కలకడ మండల తహసీల్దార్ కార్యాలయంలోనూ ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేస్తూ సర్టిఫికెట్ ప్రచురించినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ పేర్లు, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.




# శ్రీ శ్రీ శ్రీ మానసా దేవి అమ్మ వారి ని దర్శించుకున్న టిడిపి యువ నాయకులు

సిద్ధవటం ప్రజా సీమ

సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ కనుములోపల్లి లో గ్రామ సమీపాన వెలసిన శ్రీశ్రీశ్రీ మానస దేవి అమ్మవారిని శుక్రవారం ఉదయం భాకరాపేటకు చెందిన టిడిపి యువ నాయకులు తుర్ర ప్రతాప్ నాయుడు, నాగం నర్సింహారెడ్డి, అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు అనంతరం ఆలయ వ్యవస్థాపకులు లచ్చుమయ్య, ప్రతాప్ నాయుడు ను నరసింహారెడ్డిని ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు



# స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

## నూతన టీ షాప్‌ను ప్రారంభించిన మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు

(ప్రజా సీమ )

సాయిబాబా నగర్ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్పలో నర్సింగ్ రావు నూతనంగా ఏర్పాటు చేసిన టీ షాప్‌ను మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మన్నె రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాలు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని అన్నారు. స్వయం ఉపాధిని ఎంచుకుని ముందుకు సాగుతున్న నర్సింగ్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారం దినదినాభివృద్ధి చెంది మంచి పేరు, ఆదాయం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చక్రి, భాస్కర్ రెడ్డి, కుమారి, సుధాకర్, రేఖ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

## శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానం పెంపుదలే లక్ష్యం

### - ఎంఇఓ వెంకట్రామిరెడ్డి

వేంపల్లె ప్రజాసీమ:

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానం పెంపుదలే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఎంఇఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఎంఇఓ మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి జన విజ్ఞాన వేదిక ఎన్నో టెస్టులు నిర్వహిస్తూ జ్ఞానాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాస్ మాట్లాడుతూ విధ్యార్థుల్లో సైన్స్ ఎన్నో ఆలోచనలు పెంపొందిస్తుందని, విధ్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు చాలా ఉపయోగ పడుతాయని వెల్లడించారు. అలాగే విజేతలుగా నిలిచిన టీమ్ లకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల నుంచి మొత్తం 11 టీమ్ లు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీచైతన్యలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

### - కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి వెల్లడించారు. శుక్రవారం విధ్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో వినాయకుని విశిష్టతను తెలియజేశారు. పాటలు, నృత్యాలు, స్కిట్లు, ప్రసంగాలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తమ ప్రదర్శనల ద్వారా చాటి చెప్పారు. పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహించాలని కరస్పాండెంట్ విజ్ఞప్తి చేశారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చుని, ప్రకృతి కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు.



## చెకుముకి పోటీల్లో శ్రీచైతన్య విధ్యార్థుల ప్రతిభ

### - జిల్లా స్థాయికి ఎంపిక పట్ల కరస్పాండెంట్ హర్షం

వేంపల్లె ప్రజాసీమ:

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విధ్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీ పరిక్షలకు తమ పాఠశాల నుంచి ఆరుగురు విధ్యార్థులు పాల్గొన్నగా.. ధర్మతేజ, ధనుష, గంగా ప్రియదర్శిని ప్రతిభ కనబరుస్తూ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈనెల 26న జిల్లా కేంద్రమైన కడపలో జిల్లా స్థాయి పోటీ పరిక్షల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. సైన్స్ పై ఆశక్తి పెంచుకొని పోటీల్లో రాణించడం హర్షణీయం అన్నారు. జిల్లా స్థాయిలో రానించి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.




## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - డా.షరీఫ్

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక ఆర్ఎక్స్ క్లీనిక్ లో నేడు శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా. షరీఫ్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కడప మల్టీస్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బిపి, షుగర్, థైరాయిడ్, పక్షవాతం, నరాలు, మోకాళ్ల నొప్పులు, రక్తహీనత, క్యాన్సర్ నిర్ధారణ పరిక్షలతో పాటు స్త్రీ సంబంధిత వ్యాధులు తదితర వాటిపై ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. స్థానిక నాల్గు రోడ్ల కూడలిలోని ఆర్ఎక్స్ క్లీనిక్ లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు.




# పఠాన్ ఖాదర్ ఖాన్ సేవలు పలువురికి ఆదర్శం

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ హర్షం

మదనపల్లె (ప్రజా సీమ) :

ఏపీ ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్,టిడిపి రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ సేవలు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి,ఆర్టీసీ 1,2 డిపోల ఈయు గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా),టిడిపి పట్టణ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజతో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా తులసి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సోదరులకు మట్టి వినాయక ప్రతిమలు,మొక్కలను అందజేస్తూ పఠాన్ ఖాదర్ ఖాన్ గొప్ప మనసును చాటుకుంటున్నారన్నారు.అన్ని విఘ్నాలు తొలగిపోవాలని ఆదిదేవుడైన వినాయకుడికి తొలి పూజలు అందించడం ఆనవాయితీ అని,అటువంటి పండుగ నిర్వహణకు ముస్లిం సోదరులు ముందు ఉండడం శుభసూచకన్నారు.ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పఠాన్ ఖాదర్ ఖాన్ ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు.అనంతరం నాగూర్ వలి మాట్లాడుతూ మతసామరస్యానికి మదనపల్లి పట్టణం ఆదం ్శంగా నిలుస్తోందని, ముస్లిం,హిందువులు ఐకమత్యంతో ముందుకు సాగడమే ఇందుకు నిదర్శనమన్నారు.అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పఠాన్ ఖాదర్ ఖాన్ గొప్ప మానవతావాది అని



నిరూపించుకున్నారన్నారు.ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని 13వ తేదీ అనగా ఆదివారం ఉదయం 10 గంటలకు తాజ్ హోటల్ ప్రక్కన మట్టి వినాయక ప్రతిమలు,మొక్కలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని,కావున టిడిపి నాయకులు,కార్యకర్తలు,ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ఎంపీ మిథున్ రెడ్డి యువతకు రోల్ మోడల్

## - యువనేత హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

## - హాజరైన వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,ప్రముఖులు





మదనపల్లె (ప్రజా సీమ) :

రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఎంపి మిథున్ రెడ్డిపై అభిమానం ఉప్పొంగింది.ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని శుక్రవారం వైసీపీ నియోజకవర్గంలో యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం మెగా రక్తదాన శిబిరం,2000 వేల మందికి అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మదనపల్లె సమన్వయ కార్యకర్త నిస్సార్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు,కార్యకర్తలుయువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి (హర్ష) స్వయంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.ఈ శిబిరంలో సుమారు 100 మంది వరకు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు,బ్రెడ్,పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ మిథున్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవవచ్చునన్నారు. హర్షవర్ధన్ రెడ్డి (హర్ష) మాట్లాడుతూ యువతకు ఎంపీ మిథున్ రెడ్డి రోల్ మోడల్ అని,ఆయన జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.అవసరమైన వారికి రక్తం అందించాలనే ఉద్దేశంతో తాను స్వయంగా రక్తదానం చేసినట్లు తెలిపారు.పార్టీ కార్యకర్తల శ్రేయస్సు,ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పరితపించే ఎంపీ మిథున్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఎస్వి రమణ,ప్రసాద్ బాబు,ఈశ్వర్ నాయక్,డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి,పవన్ తేజ రాయల్,కోళ్లబైలు అనిల్ కుమార్ రెడ్డి,అన్వేష్,హర్ష యువసేన అంబులెన్స్ మహి,కౌశిక్ రాజు, అశోక్ రాయల్,పూర్ణ,గోవా, శివ,దీపక్, హరి,గణి,చంద్ర కాలనీ రామచంద్ర,చిప్పిలి మల్లికా ర ్జున రెడ్డి,మాధవరెడ్డి, నాగమణి, మేరీ, వినుతా భాయి,మంజుల, ధనలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట పట్టణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

### సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్. భావనకు వినతిపత్రం అందజేసిన టీడీపీ యువ నాయకుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్

రాజంపేట (ప్రజా సీమ):

రాజంపేట పట్టణంలో నెలకొన్న ప్రధాన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి, మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్ సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్. భావనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కీలక వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రాజంపేట పట్టణంలో మౌలిక వసతుల కొరత కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవడం, డ్రైనేజీ సమస్యలు, అస్తవ్యస్తమైన ట్రాఫిక్ కారణంగా ప్రజల దైనందిన జీవితం తీవ్రంగా ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. పట్టణానికి శాశ్వత పరిష్కారం చూపేలా సమగ్ర భూగర్భ డ్రైనేజీ (ఖ+ణ) వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వర్షపు నీటి కాలువలను పూర్తిస్థాయిలో పరిశీలించి పూడికతీత పనులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కాలువలు నిర్మించాలని కోరారు. అలాగే సుద్దగుంటల, సాతపల్లి మెయిన్ రోడ్డు, శివాజీనగర్, రెడ్డివారి వీధితో పాటు పలు వార్డుల్లో అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టి అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారుల్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణ చేపట్టాలని, అక్రమ ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలను నియంత్రించాలని కోరారు. పట్టణ ప్రజలందరికీ స్వచ్ఛమైన రక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలను సరిచేసి కలుషిత నీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్ పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి చెత్తను క్రమం తప్పకుండా తరలించాలని, మార్కెట్‌కు అవసరమైన మౌలిక



సదుపాయాలు కల్పించి ఆధునీకరించాలని కోరారు. పెద్ద మసీదు పరిసరాల్లో మురుగునీరు నిలవకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరతను తక్షణమే తీర్చి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు బైపాస్ లేదా రింగ్ రోడ్డు నిర్మాణ సాధ్యాసాధ్యాలపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. ఆధునిక ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా వినతిపత్రంలో కోరారు. పట్టణ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డాక్టర్ నవీన్ కుమార్ కోరారు. వినతిపై సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్. భావన సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో సమస్యలపై చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు లక్ష్మీనారాయణ, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గీతం జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు.

పిఠాపురం.(ప్రజా సీమ )

శ్రీ గీతం జూనియర్ కళాశాల, పిఠాపురంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ఓ. రామాంజనేయులు, కరస్పాండెంట్ జి. దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావుతో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు నూతనంగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుతూ విద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరై, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ మంచి మార్కులు సాధించాలని వారు ఆకాంక్షించారు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థుల ఉత్సాహభరిత కార్యక్రమాలతో ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా సాగాయి



ప్రజాసీమ

# విద్యుత్ బిల్లుల చెల్లింపుపై పరిమితి వద్దు! -

## - అగ్రహారం సబ్‌స్టేషన్ వద్ద సీఐటీయూ ధర్నా






**పిఠాపురం,(ప్రజా సీమ ):**

స్థానిక అగ్రహారం కరెంట్ ఆఫీస్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ బిల్లు చెల్లింపు పాయింట్ వద్ద కరెంట్ వినియోగదారుల నుంచి బిల్లులను నగదు రూపంలో యథావిధిగా స్వీకరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కె. చిన్న, జి. వీరబాబు మాట్లాడుతూ గతంలో రూ. 10 వేల వరకు నగదు రూపంలో విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉండేదని, ప్రస్తుతం రూ. 2 వేల వరకు మాత్రమే నగదు తీసుకుంటామని చెప్పడం సరికాదన్నారు. ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లేదా ప్రైవేటు కలెక్షన్ కేంద్రాల ద్వారా బిల్లులు చెల్లించాలని వినియోగదారులను కోరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, ప్రభుత్వ రంగ సంస్థలోని బిల్లు చెల్లింపు పాయింట్‌ను తొలగించే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం డీఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఏపీ ఈపీడీసీఎల్ ఏడీఈతో ఫోన్‌లో నాయకులు మాట్లాడగా, వినియోగదారులు ఎంత మొత్తమైనా నగదు రూపంలో బిల్లు చెల్లించేలా ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లు చెల్లించే విధానాన్ని వివరించేందుకు ఒక వ్యక్తిని అక్కడ ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ముందస్తుగా సమాచారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పప్పుల వీరబాబు, కె. నాగేశ్వరరావు, ఎం. సత్తిబాబు, డి. సత్యనారాయణ, వి. సూర్యనారాయణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం

## గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారమే ఆరోగ్యానికి పునాది -- సూపర్వైజర్ పార్వతీదేవి

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

జాతీయ పోషణ మాసం సందర్భంగా తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం వత్తలూరు సెక్టార్ పరిధిలోని ఈడిగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పార్వతీదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ పార్వతీదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న అనుబంధ పోషకాహారం, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సలహాలు, టీకాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో తల్లుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొని పోషకాహారంపై అవగాహన పొందారు.



# అత్యంత ప్రజాదరణ కలిగిన నేత ఎంపీ మిథున్ రెడ్డి

## - వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ప్రశంసలు

## - సేవా కార్యక్రమాల నడుమ ఎంపీ పుట్టినరోజు వేడుకలు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి.మిథున్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలోని మిథున్ రెడ్డి కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకట చలపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహ్మద్ ప్రారంభించారు. అదేవిధంగా అవెన్యూ రోడ్డులో వైకాపా నేత జన్నే శేషాచలపతి నాయుడు,రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.పి రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంచారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఎస్.నిసార్ అహ్మద్ మాట్లాడుతూ అన్ని దానాలలోకి రక్తదానమే మిన్న అని అన్నారు. ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాలను కాపాడే అమూల్యమైన సహాయం అని,అందుకే జన్మదిన వేడుకలను రక్తదాన శిబిరం వంటి సేవా కార్యక్రమంతో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. చిన్న వయసులోనే మహామహులైన రాజకీయ ప్రత్యర్థులపై పై చేయి సాధించిన ఓటమెరుగని నేత మిథున్ రెడ్డి అని కొనియాడారు. యువత రక్తదానం,అన్నదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా భాగస్వాములు కావాలని మిథున్ రెడ్డి యువతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ,సేవా కార్యక్రమాలను ప్రోత్సహించే నాయకుడిగా నిలుస్తున్నారని నిసార్ అహ్మద్ అన్నారు. నిరంతరం ప్రజల మేలు కోసం పనిచేసే ఎంపీ మిథున్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. యువజన విభాగం నాయకులు పవన్ రాయల్,యువ ఖాదర్,విష్ణు,ఉదయ్, మోహన్,అనిల్ ,ధనరాజ్,చందుతేజ,నాగరాజ్,సుధ,అరుణ్ ,రాఘవ,అనిల్ కుమార్,నవీన్,అనిల్ కుమార్,సాయి చరణ్,మొహమ్మద్ రజబ్,అంజి,జీవన్,సాగర్,ఈ.చందు,ఎస్. వెంకటేష్ తదితరులతో పాటుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి,వైస్ చైర్మన్ నూర్ ఆజాం,వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి,లియాఖత్ అలీ ఖాన్,శీలం రమేష్,మాజీ కౌన్సిలర్లు ఎన్.ఇర్ఫాన్ ఖాన్,బాలగంగాధర్ రెడ్డి,పాల్ చంద్రశేఖర్ ,ప్రసాద్ బాబు,నర్రి బాబాయ్,మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె మహేష్ బాబు,గ్రానైట్ మహేశ్,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,వలసపల్లి నాగరాజ రెడ్డి,వడిగల శ్రీకాంత్,పూజారి చరణ్,ఎన్.నవాజ్ అలీ ఖాన్,తాజ్ బాషా (క్వాలిటీ నట్స్),కొత్తపల్లి నాగార్జున నాయుడు,గుదిటి చరణ్, కొత్త ప ల్లి మహేశ్,యూనస్, యాసిన్, షానవాజ్, బొమ్మిశెట్టి మధు,నాగిరెడ్డి, మాద ్వ రెడ్డి,సాంబశివారెడ్డి ,ఆవులసోమశేఖర్ రెడ్డి,మజ్జిగ కేశవ యాదవ్ ,ఆవుల విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం,షేక్ జాబి,నూర్ మొహియుద్దీన్ ఖాన్,నరసింహులు నాయుడు,ఖాదర్ యువ,సాయి చరణ్,విష్ణు,సంతోష్,నవీన,గణేష్,మాలెపా డు చలపతి,పవన్ రాయల్,రిచర్డ్స్,కత్తి మంజునాథ్ ,వినుతా భాయి,ధనలక్ష్మి,మేరీ, ఖిజర్,నాగమణి,షేక్ షమ, అమ్మాజాన్, బొమ్మిశెట్టి మధు,మహేష్, అబ్దుల్లా, సాధిక్,నాసీర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాకు విచ్చేసిన జనసేన ఎమ్మెల్యే దేవా వరప్రసాద్

## - అపూర్వ స్వాగతం పలికిన రామదాస్ చౌదరి,జంగాల శివరామ్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

తిరుపతి జిల్లా,రేణిగుంట విమానాశ్రయానికి శుక్రవారం విచ్చేసిన రాజోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్,మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగారపు రామదాస్ చౌదరి,మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్,రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర,బండి మనోహరలు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తో నాయకులు చర్చించారు. స్థానిక ఎన్నికలను జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని,కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా స్థానిక స్థాయిలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని,కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని దేవ వరప్రసాద్ సూచించారు. తాతంశెట్టి నాగేంద్ర,రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కూడా దేవా వరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక ఎన్నికల నేపథ్యంలో జనసేన,కూటమి నాయకుల మధ్య సమన్వయంపై చర్చించారు.




# రోడ్డుపై అక్రమ ర్యాంపు.. సామాన్య కుటుంబానికి రాకపోకలు బంద్

## అధికారుల ఆదేశాలున్నా తొలగించలేదని బాధితుడి ఆరోపణ

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆడుకోవాలని కోలా వీర రాఘవులు ఆవేదన.





**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

తన ఇంటికి వెళ్లే ఏకైక రహదారిని ఆక్రమించి భారీ ర్యాంపు నిర్మించడంతో తమ కుటుంబం రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని గొల్లప్రోలుకు చెందిన కోలా వీర రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలోని కరణంగారి తోటలో తాను సర్వే నంబరు 590/3లో స్థలం కొనుగోలు చేసి రేకుల షెడ్ నిర్మించుకుని కుటుంబంతో నివసిస్తున్నట్లు తెలిపారు. స్థలం విక్రయ సమయంలో ఉత్తరం వైపు 16 అడుగుల రహదారి ఉన్నట్లు క్రయదస్తావేజుల్లో పేర్కొన్నారని, అనంతరం సంబంధిత లింక్ డాక్యుమెంట్లలోనూ 12 అడుగుల రహదారి ఉన్నట్లు నమోదు అయిందని వివరించారు. అయితే సమీపంలోని శ్రీవారి సన్నిధి కల్యాణ మండపం యజమాని గిడుతూరి సురేష్ రహదారి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, రహదారి మధ్యలో భారీ ర్యాంపు నిర్మించి రాకపోకలకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. రాళ్లు అడ్డుగా వేయడంతో తమ ఇంటికి నడిచి వెళ్లడం కూడా కష్టంగా మారిందన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన తమ కుటుంబ సభ్యులను దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### అధికారుల పరిశీలన

రోడ్డు సమస్యపై జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను పలుమార్లు కలిసి ఫిర్యాదు చేసినట్లు వీర రాఘవులు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, గొల్లప్రోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్థానికులు, స్థలాల కొనుగోలుదారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ర్యాంపును 20 రోజుల్లో తొలగించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించినప్పటికీ, గడువు ముగిసినా ర్యాంపు తొలగించలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ తమ పరిధిలోని విషయం కాదంటూ వాయిదా వేశారని తెలిపారు.

### అంబులెన్స్ కూడా రాని పరిస్థితి

రహదారి మూసివేయడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్, ద్విచక్ర వాహనం సైతం తమ ఇంటి వద్దకు చేరుకోలేని పరిస్థితి ఉందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులను ఆస్పత్రికి తరలించాల్సి వచ్చినా ఇబ్బందులు తప్పవన్నారు. ఈ సమస్య తమ కుటుంబానికి జీవన్మరణ సమస్యగా మారిందని పేర్కొన్నారు. అలాగే కల్యాణ మండపం నిర్మాణం, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు, బాణసంచా కాల్పులపై కూడా గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు రోడ్డుపై నిర్మించిన అక్రమ ర్యాంపును తక్షణమే తొలగించి, ఇంటికి వెళ్లే మార్గాన్ని పునరుద్ధరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను న్యాయం చేయాలనీ వేడుకున్నారు.

# పట్టణంలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

## - సమీక్షలో అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచనలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్ అండ్ బి,మున్సిపల్,ట్రాన్స్కో,ఇరిగేషన్ హౌసింగ్ అధికారులతో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు రెండు రోజులకు ఒకసారి ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని వాటర్ సప్లై అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు,రోడ్లు,డ్రైనేజీలు,పవర్ కట్ సమస్యలను అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరుగట్టువారి పల్లి నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు చేపట్టిన రోడ్డు వెడల్పు కార్యక్రమంలో అక్రమాలు తొలగించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేసి రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని త్వరలో హంద్రీ-నీవా జలాలు మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు చేరుకొనున్నాయని,అధికారులతో సమన్వయం చేసి మదనపల్లి పరిసర ప్రాంతాల్లోని చెరువుల నింపేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల,పలువురు టిడిపి నేతలు,సచివాలయ సిబ్బంది,అధికారులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

## -ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర పోలీసు నిఘా

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

కాకినాడ, సెప్టెంబరు 11: ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఈ చర్యలు కొనసాగుతున్నాయి.జిల్లాలోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థల పరిసరాలు, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తూ భద్రతా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిఘా ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు.

ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలు, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే సమీపంలోని పోలీసులను సంప్రదించాలని జిల్లా పోలీసులు సూచించారు.



శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# అమరావతిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హాజరు

మదనపల్లె (ప్రజా సీమ) :

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం 8వ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎస్పీ ధీరజ్ కునుబిల్లిలు హాజరయ్యారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి,పరిపాలనా సంస్కరణలు మరియు శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు.జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని,నేరాల నియంత్రణకు పోలీసు శాఖ తీసుకుంటున్న పటిష్ట చర్యలను అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.ప్రభుత్వ సేవలను సామాన్యులకు మరింత చేరువ చేసి,జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే దిశగా యంత్రాంగం పనిచేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.



# సర్టిఫికెట్లు ఇచ్చింది మీరు,, ఉద్యోగాలు ఇచ్చింది మేము,,,

## కష్టపడ్డ క్రీడాకారులకు అండగా నిలిస్తే ఆరోపణలా?

## నా హయాంలో ఇచ్చిన ఒక్క సర్టిఫికెట్ కు కూడా ఉద్యోగం రాలేదు,,,

## వైసిపి హయాంలో ఇచ్చిన సర్టిఫికెట్లకి ఉద్యోగాలు వచ్చాయి,,

## మరి సర్టిఫికెట్లు ఫేక్ అయితే ఇచ్చిన వారు ఏమవుతారు,,

## అవగాహన లేని ఆరోపణలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్,,

ఏపీ బ్యూరో,(ప్రజా సీమ)



అవగాహన లేని ఆరోపణలకు బ్రాండ్ అంబాసిడర్ గా వైయస్ జగన్మోహన్ రెడ్డి నిలుస్తారని ఆముదాలవలస ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో వచ్చిన ఉద్యోగాలపై వైసీపీ నాయకులు అలాగే వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. తాను అసోసియేషన్ లోకి వచ్చి ఒక్క సంవత్సరం వ ా ( తె వే ం అయిందని, గతంలో ఎంతో మంది క్రీడాకారులు సాఫ్ట్ బాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, డీఎస్సీ లో ప్రతిభ చూపి ఉద్యోగాలు సంపాదించారని, కేవలం తాను ఇండియన్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఫామ్ టు ఇస్తే, నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చారని ఆరోపణలు చేయడం చూస్తుంటే ఆట మీద అవగాహన లేని జగన్ కు క్రీడాకారుల కష్టాలు ఏమి తెలుస్తాయని,సర్టిఫికెట్స్ కొని డిగ్రీ లు చదివే జగన్ కు అన్ని సర్టిఫికెట్స్ ఫేక్ గానే కనిపిస్తాయని,అందుకే ప్రజలు క్రికెట్ టీమ్ ను వైసీపీ కి అందించారని,అయినా వైసీపీ వారికి




క్రీడల గురించి ,క్రీడాకారుల గురించి అర్థం కావడం లేదని,క్రీడలకు పెద్ద పీట వేస్తూ ,నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే కడుపు మంట తో తప్పుడు ఆరోపణలు చేస్తూ క్రీడాకారుల కష్టాన్ని అవమానించడం చూస్తుంటే వైసీపీ నాయకుల సైకో మనస్తత్వం తెలుస్తుంది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఫామ్ 2 కి,సర్టిఫికెట్ కి తేడా తెలుసుకో జగన్

క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఏదైనా ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సంబంధిత అసోసియేషన్ నుండి వారు అసోసియేషన్ తరపున ఫలానా సమయంలో క్రీడలు ఆడారని ధృవీకరిస్తూ ఇచ్చే పాత్రనే ఫారం 2 అని,అయితే ఏపీ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇవ్వవలసిన ఫోరం 2 పత్రాలు తాను అడహాక్ హోదాలో ఇవ్వడం జరిగిందని,అయితే తాను ఫామ్ 2 ఇస్తే నకిలీ సర్టిఫికెట్స్ ఇచ్చానని చెప్తున్నారని,అసలు నేను అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టాక ఒక్క సర్టిఫికెట్ కూడా డీఎస్సీలో పెట్టలేదని,గతంలో ఆడిన క్రీడాకారుల భవిష్యత్తు కోసం వారి కష్టాన్ని నాశనం చెయ్యకుండా ఉండేందుకు అండగా నిలవడం జరిగిందని,కానీ అధికారం కోసం అన్ని అక్రమ దారులు తొక్కే జగన్ కు ఇది నకిలీ ఏది అనే కనీష ఇంగితం లేదని,ఎవరో ఒకరు రాయడం,ఆది చూసి చదవడం తప్ప జగన్ కు ఏమి తెలియదని,తన రాజకీయ అవసరాల కోసం సొంత వారినే మట్టుపెట్టే జగన్ కి క్రీడా కారుల భవిష్యత్తు ఒక లెక్కా అని ప్రశ్నించారు.గత 5 ఏళ్లు పిచ్చి తుక్లక్ పాలనలో రాష్ట్రం నాశనం అయ్యిందని, ఇప్పుడు అందరికి మంచి జరుగుతుంటే ఉనికి కోసం తప్పుడు ఆరోపణలు చేస్తూ,ఫేక్ చానల్స్,పేపర్లు అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తే ప్రజలు మరో సారి బుద్ధి చెప్తారని ఆయన తెలియజేశారు.

# పిఠాపురం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కె. యామిని ప్రసాద్‌కు ఘన సన్మానం

పిఠాపురం :(ప్రజా సీమ )

పిఠాపురం పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రముఖ ఉపాధ్యాయురాలు శ్రీమతి కె. యామిని ప్రసాద్ గారిని, ఆమె భర్త శ్రీ కె.వి.ఎస్.ఎస్. ప్రసాద్ తో కలిసి ఘనంగా సన్మానించారు.గొల్లప్రోలు బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన కె. యామిని ప్రసాద్ , విద్యారంగంలో సుదీర్ఘకాలం అంకితభావంతో సేవలందించి, ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. పద్మనాభం, కార్యదర్శి నూకరాజు, జిల్లా ఉపాధ్యక్షులు, పిఠాపురం యూనిట్ కార్యదర్శి దువ్వాడ సాల్మన్ రాజు తదితర అసోసియేషన్ సభ్యులు యామిని ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కె. యామిని ప్రసాద్ సుమారు 37 సంవత్సరాల పాటు విద్యారంగానికి అంకితభావంతో చేసిన విశిష్ట సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె చేసిన కృషి, ఉపాధ్యాయ వృత్తిపై చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.విద్యారంగంలో విశేష సేవలందించి పదవీ విరమణ పొందినప్పటికీ, సమాజానికి తమ అనుభవంతో మరింత సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని శ్రీమతి యామిని ప్రసాద్ దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.





# స్వయం సహాయక సంఘాలకు పోషకాహార పథకాలు అప్పగించాలి

## సుప్రీంకోర్టు సూచనలను అమలు చేయాలి - సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ వినతి

రాజంపేట (ప్రజా సీమ):

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే బాల సంజీవని, బాల సంజీవని ట్రైబల్ పథకాలను స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 28 జిల్లాలను నాలుగు యూనిట్లుగా విభజించి పోషకాహార సరఫరాకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషకాహార విషయంలో ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది సాధారణ సరఫరా టెండర్ కాదని, వేలాది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్షలాది మంది చిన్నారుల ఆరోగ్యం, పోషణతో నేరుగా ముడిపడి ఉన్న ప్రజా సంక్షేమ కార్యక్రమమని పేర్కొన్నారు. పలు జిల్లాల్లో పోషకాహార సరఫరాపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని ఆరోపించారు. బాలల పౌష్టికాహారం పెద్ద కాంట్రాక్టర్ల లాభాల కోసం కాకుండా బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రజా సంక్షేమ పథకమని మహేష్ అన్నారు. కేంద్ర విధానాలకు అనుగుణంగా స్థానిక మహిళా డ్వాక్రా సంఘాల భాగస్వామ్యంతో వికేంద్రీకృతంగా, పారదర్శకంగా, నాణ్యతతో పోషకాహారాన్ని అందించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల మాదిరిగా స్వయం సహాయక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యం కల్పించాలని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా టెండర్ నిబంధనలను రూపొందించాలని డిమాండ్ చేశారు. స్థానిక డ్వాక్రా సంఘాలు కూడా పోటీ చేసే అవకాశం ఉండేలా నిబంధనలను పునఃపరిశీలించాలని కోరారు.



భవిష్యత్తులో బాలల పోషకాహార పథకాల టెండర్లలో పారదర్శకత, పోటీ, నాణ్యత, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇచ్చేలా శాశ్వత మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. ఈ పథకాలను డ్వాక్రా సంఘాలకు అప్పగించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మహిళా సాధికారతకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఈ. సికిందర్, నాయకులు రమణ, సుధీర్, వెంకటరమణ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన విజయ్ కుమార్ యాదవ్

## - ఆప్యాయంగా పలకరించిన వైకాపా అధినేత

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా,మదనపల్లె నియోజకవర్గం,రామసముద్రం మండలం,ఎలకపల్లికి చెందిన వైకాపా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జింకల విజయ్ కుమార్ యాదవ్ శుక్రవారం విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ముందుగా విజయ్ కుమార్ యాదవ్ ని జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాజీ సీఎం జగనన్న అత్యంత ప్రజాదరణ కలిగిన నేత అని,నాయకులు కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించడం ఆయన నైజమన్నారు.కూటమి ప్రభుత్వంపై ఆయన చేస్తున్న పోరాటం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందన్నారు.బీసీ సెల్ బలోపేతానికి తాము చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించగా ప్రత్యేకంగా ప్రశంసించారన్నారు.కష్టపడి పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారన్నారు.2029లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుండే కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma